క్లుప్తంగా

మద్యం దుకాణం తొలగించడం సంతోషకరం

తాడికొండ: పొన్నెకల్లు గ్రామంలో మద్యం దుకాణం తొలగించడం సంతోషంగా ఉందని సర్పంచ్ నూకతోటి మేరిమ్మ అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడదని మహిళలు కోరుకుంటున్నారన్నారు. గ్రామంలో కొంతమంది బెల్టు దుకాణాలు కొంతమంది నడుపుతున్నారని ఎస్ఈబీ అధికారులకు ఫిర్యాదు చేయగా పలువురిని పట్టుకొని కేసులు నమోదు చేశారన్నారు. బెల్టు దుకాణాల కట్టడికి గ్రామంలో అభివృద్ధి కమిటీ ఏర్పడి బెల్టు దుకాణాలు అరికడతామన్నారు.

జగనన్న సురక్షతో సత్వర పరిష్కారం



ఫిరంగిపురం: జగనన్న సురక్షతో ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో గురువారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్షతో 11రకాల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అర్హులై ఉండి వారికి సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి పేర్లు నమోదు చేసి వలంటీర్ల సాయంతో దరఖాస్తు చేయించి జగనన్న సురక్ష ద్వారా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఏకే.బాబు, మధు, కె.ఆనంద్, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు



తెనాలి రూరల్: మండలంలోని నందివెలుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1550 స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బైక్‌లు, ఆటో సీజ్ చేశారు. నిందితుల్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ లీక్‌తో అగ్ని ప్రమాదం

- ఇంట్లో సామగ్రి దగ్ధం
- రూ. 2.50 లక్షల నష్టం

తెనాలి రూరల్: పండుగ వేళ స్థానిక మోరిస్‌పేటలోని ఓ ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. వంటింట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మోరిస్‌పేటకు చెందిన సుభాని బక్రీద్ పండుగ సందర్భంగా ఇంట్లో చిన్న ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మొదటి అంతస్తులోని వంటింట్లో గ్యాస్ సిలెండర్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ వీలుకాకపోగా మంటలు చుట్టుముడుతుండటంతో ఇంట్లోని వారంతా భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె. జితేంద్ర కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఆ లోగానే ఇంట్లోని వంట సామగ్రి, ఫ్రిడ్జ్, ఏసీలు, ఫ్యాన్‌లు, కప్‌బోర్డులు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో ప్రాణాపాయం లేదని, ఆస్తి నష్టం మాత్రం సుమారు రూ. 2.50 లక్షలవరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో సంఘ్ విజయం

తెనాలి రూరల్: తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గం కోసం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ల మధ్య బుధవారం రాత్రి జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఘన విజయం సాధించింది. విజయం సాధించిన ప్యానల్ సభ్యుల్ని సంఘ్ సభ్యులు అభినందించారు. ఈ విజయాన్ని ఎంప్లాయీస్ సంఘ జనరల్ సెక్రెటరీ రాఘవయ్యకు అంకితమించినట్లు నాయకులు పేర్కొన్నారు. రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యదర్శిగా రాజేష్, జోనల్ సెక్రెటరీగా ఉదయ్ కుమార్, ట్రెజరర్‌గా బి.గౌరీశంకరరావుతో పాటు మరో ఆరుగురు సభ్యులు విజయం సాధించారు. డివిజన్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, తెనాలి సెక్రటరీ బాజీ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు గోపాలం శ్రీనివాసరావు, ఉషశ్రీ పాల్గొన్నారు. తొలుత రైల్వేస్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



కైలాసనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



విశేష అలంకారంలో వేణుగోపాలస్వామి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనములతో ఉదయం 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి వారికి అభిషేకం నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి వారికి లక్ష తులసీ అర్చన అత్యంత వైభవంగా జరిపారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ తొలి ఏకాదశి పర్వదిన విశిష్టతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.



తులసీ దళాల అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో ఆషాఢమాస తొలి ఏకాదశి పూజలు వైభవంగా గురువారం నిర్వహించారు. ఉదయాన్నే మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. రామాలయం, నగరేశ్వర స్వామి, విజయదుర్గా ఆలయాల్లో విశేష పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. తాళ్లూరులోని వేణుగోపాల, ఆంజనేయస్వామి ఆలయం, సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథాలయంలో, వేములూరిపాడులోని జలపాలేశ్వర ఆలయం, అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు పేలపిండిని ప్రసాదంగా అందజేశారు.

మేడికొండూరు: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు వైభవోపేతంగా గురువారం నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తల స్నానాలు ఆచరించి అనంతరం దేవాలయాల్లో మొక్కుబడులు తీర్చుకున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని పేరేచర్ల సింగరాయస్వామి, కైలాసగిరి కొండపైన ఉన్న కైలాసనాదేశ్వరస్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముఖ్యంగా పేరేచర్ల కొండపైన ఉన్న సింగరయ్యస్వామికి తొలి ఏకాదశి పర్వదినం అత్యంత అనుకూలమైన దినంగా పరిగణిస్తారు. ఈ రోజున సింగరాయస్వామి కొండమీద కొబ్బరికాయలు మొక్కుబడులు చెల్లించి రైతన్నలు పొలం బాట పడతారు. కై లాసగిరి కై లాసనేదేశ్వరస్వామికి ఉదయాన్నే అభిషేకాల నిమిత్తం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మేడికొండూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నులకపేట మసీదులో పాల్గొన్న ముస్లిం సోదరులు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

తాడేపల్లిరూరల్ : బక్రీద్ పండగను పురస్కరించుకుని ముస్లింలు గురువారం తెల్లవారుజాము నుంచి మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఈద్గా మైదానంలో ఉదయం నుంచి వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దలు, చిన్నారులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నిడమర్రు రోడ్డులోని మస్జిద్ ఏ అన్వరీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ ఆచరించారు. మస్జిద్ ఏ ముహమ్మద్ ఆధ్వర్యంలో బసవతారక ఈద్గా ప్రాంగణంలో పలువురు మహిళలు నమాజ్‌కు హాజరయ్యారు.

నులకపేటలో.....

నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేటలోని ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నులకపేట నూరాని జామియా మస్జిద్ షేష్మా అహ్మద్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ అంటే త్యాగాల పండగ అని, దానికి అనుగుణంగా ముస్లింలు త్యాగ నిరతితో జీవించాలని అన్నారు. అనంతరం దువా చదివి ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో నులకపేట జామియా మస్జిద్ ప్రెసిడెంట్ సలీం బాషా, వైస్ ప్రెసిడెంట్ షేక్ బాషా, షేక్ నౌషాద్, మహమ్మద్ మస్జిద్ షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఫిరంగిపురం: మహనీయుల త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఆఫీస్‌సాబ్ మొహమ్మద్ ఉమర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని అమీనాబాద్, వేములూరిపాడు, ఫిరంగిపురం, 113 తాళ్లూరు, వేమవరం, మునగపాడు, గుండాలపాడు, మేరికపూడి, నుదురుపాడు గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. బేతపూడిలోని మజీద్ ఏ ఇస్మాయిల్‌లో ఆఫీస్‌సాబ్ మొహమ్మద్ ఉమర్ దివ్యసందేశాన్ని వినిపించారు. బక్రీద్ అనగానే మహనీయులైన హజ్రత్ ఇబ్రహీం, ఇస్మాయిల్‌ల పేర్లు గుర్తుకు వస్తాయన్నారు. ఆ మహనీయుల విశ్వాస పటిమ, త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. ప్రతి మానవుడు తన కుటుంబతోపాటుగా సమాజంలో ప్రతి ఒక్కరిని కలుపుకుని పోవాలని, ఇతరుల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం కలిగి ఉండాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన



తాడికొండ మండల పరిషత్ కార్యాలయ భవనం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి వారు గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని పేదవాడికి చేరువ చేయడంలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందని, అందుకు గ్రామస్థాయిలో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు ఇతర సదుపాయాలే నిదర్శనం అన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందుతున్నాయంటే దానికి జగనన్న చిత్తశుద్ధి పాలనే అని, ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు సాంకేతిక, ఇతర కారణాలతో ఆగిపోతే వారికి కూడా అర్హత కల్పించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకం అందరికీ వరమన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని, కేవలం ఒక వర్గమే దుష్ప్రచారం చేస్తుందనేది స్పష్టమన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు అనుభవిస్తున్న పథలు 85 శాతం మంది సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలో 78 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుటుంబాలకు న్యాయం జరిగి సమసమాజ స్థాపన జరగాలంటే జగనన్న పాలన మళ్లీ రావాలన్నారు. ఎంతమంది విమర్శలు చేసినా ఉన్నత భవిష్యత్తు కోసం ప్రజలు రాబోయే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఎన్నికల హామీలు విస్మరించి పేదలను మోసం చేసిన చంద్రబాబు నేడు ఎన్నికల ముందు దొంగ హామీలు ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుతున్నారని, ఆయనను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, యార్డు మాజీ చైర్మన్ దాములూరి రాము, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఎంఈఓ తెనాలి ఇందిర, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, తోకల నరసింహారావు, తాళ్ల శివనాగరాజు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన తలకాయల అర్జునరావు అనారోగ్యంతో మృతి చెందగా దహన సంస్కారాల కోసం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబానికి ఈమని సొసైటీ చైర్మన్ నలకుర్తి యేసుపాదం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తే ఆనంద్, జమ్ముల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

2న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



తెనాలి టౌన్: చేబ్రోలులో జులై రెండున జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మార్పీఎస్, బీజేఆర్ యూత్ నాయకులు తెలిపారు. మారీసుపేటలోని బీజేఆర్ కార్యాలయంలో గురువారం విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ పాల్గొంటారన్నారు. తెనాలి డివిజన్‌లోని ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేఆర్ యూత్ సభ్యులు, దళిత మేధావులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో అత్తోట చంటి, మేకల సురేష్, నలుకుర్తి రమేష్, కారుమూరి రాజేంద్రప్రసాద్, యడ్లపల్లి అనిల్‌కుమార్, పులి ప్రభుదాసు, జి.ప్రసాద్, సిద్దెల కమలాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో గురువారం ఫోర్‌కార్నర్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజులు విచ్చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ బుర్రా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.అచ్యుతబాబు ఆధ్వర్యంలో గుండె, కిడ్నీ, ఎముకలు, కీళ్లు, దంత, కంటి పరీక్ష, షుగర్, హిమోగ్లోబిన్, బీపీ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో బేతపూడి వెంకట సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గాదె వరలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు బుర్రా విజయలక్ష్మి, బేతపూడి వెంకటరమణ, వలపర్ల మరియదాసు, గారపాటి జ్యోతికుమార్, ఆంధ్ర హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా జగనన్ననే ప్రజలు కోరుకుంటున్నారు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్

తాడికొండ: సుపుత్రుడిపై నమ్మకం లేకనే చంద్రబాబు దత్తపుత్రుడికి ప్యాకేజీలిచ్చి రోడ్లపై తిప్పి ప్రజలను రెచ్చగొడుతున్నాడని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. సురేష్‌కుమార్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పని పూర్తిగా అయిపోయిందని గమనించిన చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అక్రమంగా సంపాదించిన సొమ్మును వెదజల్లి ప్రజలను నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నాడన్నారు. లోకేష్ బాబు యాత్రలు హాస్యాస్పదంగా కొనసాగుతున్నాయని, తెలుగు మాట్లాడటం చదవడం రాని లోకేష్, పవన్‌కల్యాణ్‌లు వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేదు కానీ సీఎం హోదాలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మంచిది కాదన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టింది ఎవరి కోసమో ఆయనకే తెలియదని, కాసేపు తానే సీఎం అని మరి కొంత సేపు నేను సీఎంను కాలేకపోయినా జగనన్నను మాత్రం కానివ్వనని వ్యాఖ్యానించడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు సృష్టించిన ఎంతమంది కల్యాణ్‌లు వచ్చినా రాష్ట్రంలో మరో 30 సంవత్సరాలు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని అన్నారు. గోదావరి జిల్లా యాత్రలో పవన్ కల్యాణ్ జ్వరం సాకుతో సినిమా డబ్బింగ్‌లు చెప్పుకుంటుండటం చూసి ఓటర్లు సైతం నవ్వుకుంటున్నారని, రాజకీయం అంటే రెండున్నర గంటల సినిమా అనుకొని పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్న ప్యాకేజీ స్టార్ రాబోయే ఎన్నికల్లో తట్టబుట్టా సర్దుకొని వెళ్లడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటిలో సంతృప్తికరంగా అందాయని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబాన్ని దర్శించినపుడు వారు మాపై చూపించే ప్రేమ, ఆదరణ అందుకు నిదర్శనమన్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూసేందుకు రాష్ట్రంలో కొనసాగుతున్న జగనన్న సురక్ష పథకంతో నూరుశాతం సంక్షేమం ప్రతి పేదవాడికి అందుతుందని, రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175/175 స్థానాల్లో విజయం సాధించి దుష్టచతుష్టయాన్ని తరిమి కొట్టడం ఖాయమన్నారు.

నెల రోజుల్లో డ్రెయిన్ పనులు పూర్తిచేస్తాం

- డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి
- చిర్రావూరు ప్రజలకు హామీ



రైతులతో మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: ఔట్ పాల్ డ్రెయిన్‌లో మురుగు ప్రవహించినప్పుడే సమస్య పరిష్కామౌతుందని, రైతులు, నివాసదారులు అందుకు సహకరించాలని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి కోరారు. గురువారం నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు నుంచి మంగళగిరి రూరల్ రామచంద్రాపురం వరకు ఔట్‌పాల్ డ్రెయిన్ పూడికతీత పనులు ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు డీఈ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ పనుల్లో కొంత జాప్యం జరగడంతో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిర్రావూరు ప్రాంతంలో ఉన్న మురుగు సమస్యతోపాటు పంటపొలాల్లో మురుగు సమస్యను పరిష్కరించాలంటే తప్పని సరిగా రెండు కిలోమీటర్ల మేర ఔట్‌పాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని, రైతులు, కరకట్ట వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉన్నవారు సహకరిస్తే నెల రోజుల వ్యవధిలో పనులను పూర్తిచేస్తామన్నారు. చిర్రావూరు నుంచి మురుగు వెళ్లాలంటే కరకట్టను ఆనుకుని రెండు కల్వర్ట్‌ల నిర్మాణాలు చేపట్టాలని, ఆ పనులు ప్రారంభించాలంటే అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డ్రెయిన్ నిర్మాణం వల్ల చిర్రావూరు గుండిమెడ డొంక నుంచి పంటపొలాల్లో నీటితోపాటు గ్రామంలోని మురుగు మొత్తం బయటకు పంపవచ్చని, నేడు టౌన్ ప్లానింగ్ అధికారులతోపాటు సర్వేయర్లు వచ్చి పరిశీలించి లెవలింగ్ వేసి పనులు చేపడతారని దయచేసి ఎవరూ అభ్యంతరం చెప్పకుండా పనులు జరిగేలా చూడాలని, మీ అందరూ సహకరిస్తే 15 నుంచి 30 రోజుల లోపు నిర్మాణ పనులు పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు సతీష్‌బాబు, తాడేపల్లి అధ్యక్షుడు వివేకానందరెడ్డి

తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, తాడేపల్లి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ విజయవాడ, డాక్టర్ గుంటూరు వరుణ్ సహకారంతో మంగళగిరి ప్రెస్‌క్లబ్ భవనంలో ఉచిత క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు హృదయ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరున రాధాలక్ష్మి హార్ట్ ఫౌండేషన్ ద్వారా వచ్చే సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు సుమారు వెయ్యి స్టంట్‌లు ఉచితంగా వేయదలిచామని, 200 యాంజియోగ్రామ్‌లను ఉచితంగా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రూ.12 వేల విలువైన టెస్ట్‌లను రూ.500లకే అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉన్న విలేకరులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు త్రిపురమల్లు సతీష్‌బాబు, తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, మంగళగిరి క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి, పాస్ట్ ప్రెసిడెంట్ మాజేటి వంశీకృష్ణ, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ అందె మురళి, అధ్యక్షులు ఎలెక్ట్ అందె రేవంత్, డైరెక్టర్లు భిక్షారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, శాఖమూరి ఉమామహేశ్వరరావు, ప్రకాశరావు, ప్రెస్‌క్లబ్ నుంచి రూఫస్ తదితరులు పాల్గొన్నారు.

జీ చానల్ కరకట్టపై బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- ఇరిగేషన్ శాఖ అభ్యంతరంతో నిలిచిన పనులు
- ఎంపీ అయోధ్య రామిరెడ్డి చొరవతో తిరిగి అనుమతులు
- టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్న నగర పాలక సంస్థ



ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన గుంటూరు చానల్ రహదారి

తాడేపల్లిరూరల్: గుంటూరు చానల్ కరకట్ట మీదుగా పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. దీంతో మరోసారి టెండర్లు పిలిచేందుకు నగర పాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. విజయవాడ గుంటూరు మహానగరాల మధ్యలో పలు ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉండవల్లి లాంటి ప్రాంతాల్లో ఎంతో మంది స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో పంటపొలాలు సైతం నివాస స్థలాలుగా మారాయి. ఉండవల్లి గుంటూరు చానెల్ హెడ్ స్లూయిజ్ నుంచి పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు పంటపొలాలు నివాస ప్రాంతంగా మారాయి. ఆ ప్రాంతంలో సరైన రహదారుల నిర్మాణాలు లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగర పాలక సంస్థ అధికారులతో కలసి పర్యటించి ఉండవల్లి హరిజనవాడకు వెళ్లే కరకట్ట నుంచి గుంటూరు చానల్ కరకట్ట మీదుగా పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు రహదారి నిర్మాణం చేస్తే బాపనయ్యనగర్, సాయినగర్‌లతో పాటు అమరావతికి వెళ్లే రహదారిలో ఉన్న నాలుగు బజార్లలో నివసించే వారు విజయవాడ వెళ్లేందుకు ఈ రహదారి ఉపయోగించవచ్చని, నాలుగు రోడ్ల కూడలి అయిన ఉండవల్లి సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అయినపుడు అమరావతి రోడ్ నుంచి నేరుగా ప్రకాశం బ్యారేజ్‌కు వెళ్లేందుకు ఉపయోగపడుతుందని భావించి తొలుత రూ. రెండు కోట్ల వ్యయంతో గ్రావెల్ రోడ్ నిర్మాణం చేపట్టారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి కేటాయించారు. రహదారి నిర్మాణం చేస్తున్న సమయంలో ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే ఆర్కే, ఎంపీ అయోధ్యరామిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి కరకట్ట మీద బీటీ రోడ్ నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకువచ్చారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఆ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

గుంటూరు చానల్‌లో తూటాకు తొలగింపు



తాడేపల్లిరూరల్: గుంటూరు చానల్‌లో తూటాకు తొలగింపు పనులను ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. కృష్ణానది ఎగువ నుంచి గుంటూరు చానల్ ద్వారా తాగు, సాగునీటిని అందిస్తున్నారు. కాలువలో కొంతకాలంగా తూటాకు పెరిగిపోవడంతో రైతులతోపాటు పలు గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు ఇబ్బంది పడుతున్నారు. గుంటూరు చానల్ జేఈ అన్వేష్ మాట్లాడుతూ ప్రస్తుతం జీరో పాయింట్ నుంచి 14.4 కిలో మీటర్ వరకు గుంటూరు చానల్‌లో ఉన్న తూటాకు తొలగిస్తున్నామని, తూటాకు తొలగించిన అనంతరం దెబ్బతిన్న రివిట్ వాల్, కోతకు గురైన కట్టను మరమ్మతులు చేసేందుకు మొత్తం రూ.24 లక్షలు కేటాయించామని, త్వరితగతిన ఈ పనులు పూర్తిచేసి గుంటూరు చానల్‌కు సాగు, తాగునీరు అందజేయనున్నట్లు తెలిపారు.